**కథ**

# పరివర్తన

**'టప్' మన్న శబ్దంతో ఒక్కసారిగా బాటిల్ మీద మూత పైకి ఎగిరింది. మూత ఓపెన్ కావడంతోనే ఆ బాటిల్ లోని బీరు ఒక్కసారిగా జివ్వుమని శబ్దం చేస్తూ బయటికి పొంగింది.**

**దాని ఎదురుగా కూచుని వున్న శేఖర్ ఆవేశంతో ఆ బాటిల్‌ని చేతిలోకి తీసుకుని పైకెత్తి గడగడా తాగేసి ఖాళీ బాటిల్ టేబుల్ మీద పెట్టాడు.**

అతని చుట్టూ కూచున్న నలుగురు ఫ్రెండ్స్ అతని వంకే చూస్తున్నారు. వారు ఏ భావంతో చూస్తున్నారోగాని శేఖర్‌కి మాత్రం వారి చూపుల్లో ఎగతాళి, జాలి, సానుభూతే కనిపిస్తోంది. అదే భరించలేకపోతున్నాడు అతను.

"ఒరేయ్ శేఖర్" అందులో ఒకతను శేఖర్ భుజం మీద చేయి వేసి ఏదో చెప్పబోయాడు అనునయంగా.

"హు.." అతని చేతిని విసిరి కొడుతూ హూంకరించాడు శేఖర్. అతని కళ్ళు చింతనిప్పుల్లా మెరుస్తున్నాయి. గాయపడ్డ పులిలా గాండ్రిస్తున్నాడు అతను. కసి, ద్వేషంతో రగిలిపోతూ పళ్ళు కొరికాడు.

అతనిలోని కసికి, ద్వేషానికి కారణం అతని క్లాస్‌మేట్ దీప్తి. దీప్తి వాళ్ళ నాన్నకి వైజాగ్ నుండి హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ కావడంతో వాళ్ళ కుటుంబం ఆరునెలల క్రితమే హైదరాబాద్‌కి వచ్చారు.

అందువల్ల దీప్తి డిగ్రీ సెకండియర్ వరకూ వైజాగ్‌లోనే చదివినా ఫైనలియర్ కోసం శేఖర్ కాలేజీలోనే జాయిన్ అయింది. శేఖర్‌ది, దీప్తిది ఒకే గ్రూప్ కావడంతో పరస్పరం విష్ చేసుకోవడం, పలకరింపుగా నవ్వుకోవడం జరిగేది.

శేఖర్ విషయంలో దీప్తి కేవలం పరిచయం దగ్గరే ఆగిపోతే, శేఖర్ మాత్రం దీప్తి గురించి ఊహలు అల్లుకుని దానికి ప్రేమ అని నామకరణం చేసుకున్నాడు. ఒకానొక శుభముహూర్తాన ఆమెకి తన ప్రేమ విషయాన్ని తెలియచేశాడు. కానీ దీప్తి మాత్రం అతని ప్రపోజల్‌ని తిరస్కరించింది!

దాంతో మొదట ఖంగుతిన్న శేఖర్ ఆ తరువాత మరింత పట్టుదలగా దీప్తి వెంటపడ్డాడు. ఎక్కడ పడితే అక్కడ ఆమెను అడ్డగించి ప్రేమించమని వేధించాడు. అతను దీప్తికి దగ్గర కావాలని చేసిన ప్రయత్నాల వల్ల దీప్తికి అతని మీద ప్రేమ ఏమో కానీ ఇంకా చికాకు, అసహ్యమే కలిగింది. అందుకే అతనిని ఛీదరించుకుంది.

అయినా శేఖర్ తన పట్టు సడలించలేదు. ఎలాగయినా దీప్తిని ప్రేమించేలా చేసుకుంటానని ఫ్రెండ్స్ ముందు తను గొప్పగా చెప్పిన మాటలు అతనికి గుర్తుకువచ్చి అతనిలో పంతం రెట్టింపయ్యేది.

ఇక చివరి ప్రయత్నంగా రక్తంతో ప్రేమలేఖ వ్రాసి ఇచ్చాడు దీప్తికి. ఆ ఉత్తరం చూసి ఉద్వేగంతో పరిగెత్తుకుని వచ్చి తనని అల్లుకుపోతుందనుకున్నాడు. కానీ, అతని ఊహలకు విరుద్ధంగా దీప్తి ఆ ఉత్తరాన్ని అతని కళ్ళముందే ముక్కలుగా చేసి విసిరేసింది.

"రక్తంతో లెటర్ వ్రాయడం ప్రేమకు పరాకాష్ట అని అనుకుంటున్నావేమో. అది నీ సైకో మనస్తత్వానికి నిదర్శనం. ఇంకొకసారి ఇలాంటి చీప్ ట్రిక్స్ నావద్ద ప్లే చేయకు" అని విసురుగా అక్కడి నుండి కదిలింది.

అవమాన భారంతో శేఖర్ మొహం మీద నెత్తురుచుక్క లేకుండా పాలిపోయింది. దానిని కప్పిపుచ్చుకునే ఉద్దేశంతో, "ఏం..నాకంటే ముందే ఇంకెవడికన్నా బుక్ అయ్యావా?" అని అన్నాడు. అతను అన్న ఆ మాటతో తిరిగి వెళ్ళిపోతున్న దీప్తి చివాల్న వెనక్కి తిరిగి అతని దగ్గరికి వచ్చింది. అవమానంతో ఆమె మొహం ఎర్రబారింది.

"ఏమన్నావు?" కోపంతో అడిగింది.

శేఖర్ తిరిగి అన్నాడు నిర్లక్ష్యంగా. మరునిముషమే అతని చెంప పేలిపోయింది. ఊహించని ఆ సంఘటనకు దిమ్మతిరిగిపోయింది.

దీప్తి అపరకాళిలా చూస్తూ "రాస్కెల్, ఆడపిల్లలంటే ఆటబొమ్మలనుకుంటున్నావా? ఇన్నాళ్ళూ తోటి విద్యార్థివని ఊరుకున్నాను. ఇక ఉపేక్షించను. ఆడపిల్ల తెగువ ఏంటో చూపిస్తాను" అని అక్కడినుండి వెళ్ళిపోయింది.

అలా వెళ్ళిన దీప్తి అదే రోజు పోలీస్ కంప్లయింట్ ఇచ్చింది. వెంటనే పోలీసులు శేఖర్ మీద కేసు ఫైల్ చేసి సెల్‌లో వేసారు. పోలీసు మర్యాదలు కూడా బాగానే చేశారు.

నాలుగు రోజుల తరువాత శేఖర్ తల్లిదండ్రులు దీప్తిని ప్రాధేయపడిన మీదట దీప్తి కేసును విత్‌డ్రా చేసుకుంది. పోలీసులు శేఖర్‌ని వదిలిపెట్టారు.

అందుకే శేఖర్ దీప్తిమీద పగతో రగిలిపోతున్నాడు.

"అయినా దానికి అంత పొగరేంట్రా? నీమీదే పోలీస్ రిపోర్ట్ ఇస్తుందా- దానికెంత ధైర్యం" అన్నాడు శేఖర్ స్నేహితులలో ఒకడు.

"మనవాడి పర్సనాలిటీ చూసి అమ్మాయిలంతా వీడంటే పడిచస్తుంటే ఆ దీప్తి మాత్రం వీడిని ఈగలా తీసి పడేసింది" ఇంకో స్నేహితుడు అన్నాడు.

స్నేహితుల మాటలు శేఖర్‌కి అగ్గిమీద ఆజ్యం పోసినట్లయింది. ఇంకా అతని గుండెలో మంట రగిలిందేగానీ ఏమాత్రం ఆరలేదు.

"పోనీలేరా శేఖర్- ఆ దీప్తి విషయం నీవల్ల అయ్యేది కాదు కానీ, వేరే ఎవరయినా నీకు తగిన ఫిగర్‌ని చూసుకో" అంటూ నోట్లో పెగ్గు వేసుకోబోయాడు శేఖర్ స్నేహితుడు.

కానీ వెంటనే శేఖర్ ఆవేశంగా అతని కాలర్ పట్టుకుని "ఏంట్రా..ఏంట్రా వాగుతున్నావ్. నాకు తగిన ఫిగర్‌ని చూసుకోవాలా. అంటే దానికి నేను తగనని నీ ఉద్దేశం. చంపేస్తాను" అన్నాడు శేఖర్.

"అరే..శేఖర్ ఏంట్రా ఇది. వదులు. వాడిని వదులు. నీకేమయినా పిచ్చి పట్టిందా..వదల్రా" అంటూ మిగతా ఫ్రెండ్స్ బలవంతంగా శేఖర్‌ని వెనక్కి లాగి కుర్చీలో కూర్చోపెట్టారు.

కసితో పిడికిలి బిగించి టేబుల్ మీద గట్టిగా కొట్టి అసహనంగా అటూ ఇటూ కదిలాడు.

"మనలాంటివాళ్ళ కాలర్ పట్టుకోవడం తప్ప ఆ దీప్తిని ఎదుర్కొనే సత్తా వీడికెక్కడుందిరా..పదండి" శేఖర్ స్నేహితుడు నిరసనగా అని అక్కడినుండి కదిలాడు.

"ఈ ఆవేశమేదో నిన్ను ఉల్లిపొరలా తీసి పడేసిన నీ ప్రేయసి మీద చూపించు. అప్పుడు నిన్ను మెచ్చుకుంటాం" అందరూ వెళ్ళిపోయారు.

శేఖర్ ఒక్కడే మిగిలిపోయాడు అక్కడ.

* * *

"ఏ కాలేజీలో అయితే తనను అందరిముందు అవమానించి పోలీసులకు పట్టిచ్చిందో అదే కాలేజీలో అందరి ముందు దాన్ని చంపి నా పీడ చల్లార్చుకుంటాను" అనే స్థిర నిశ్చయానికి వచ్చిన శేఖర్ ఆ తరువాత నాలుగు రోజులు కాలేజీకి వెళ్ళలేదు.

ఆ నాలుగు రోజులు దీప్తిని చంపడానికి కావలసిన మానసిక స్థైర్యాన్ని సమకూర్చుకున్నాడు. మెరుస్తున్న పదునైన కత్తిని నడుము దగ్గర బెల్ట్ వెనుక దోపుకుని హుషారుగా బైక్ ఎక్కి కాలేజీకి బయలుదేరాడు.

కానీ, తను జైలుకు వెళ్ళి వచ్చినప్పటినుండీ రెండు కళ్ళు తనను నిశితంగా పరిశీలిస్తున్నాయన్న విషయంగానీ, ఇప్పుడు కూడా తను కత్తిని తీసుకుని కాలేజీకి బయలుదేరిన విషయం ఆ కళ్ళు గమనించాయన్న విషయంగానీ శేఖర్‌కి తెలీదు.

* * *

దీప్తి క్యాంటీన్‌లో కూచుని ఉంది. ఫ్రెండ్స్‌తో మాట్లాడుతూ టీ తాగుతోంది. ఫ్రెండ్స్ వేసిన జోక్స్‌కి మధ్య మధ్యలో ఆహ్లాదంగా నవ్వుతోంది.

దీప్తిని చంపడానికి ఇదే సరైన సమయం అనుకున్నాడు శేఖర్. తన నడుము దగ్గరున్న కత్తిని తడిమాడు. అది చల్లగా తాకింది అతని చేతికి. నెమ్మదిగా దీప్తి వైపు అడు



గులు వేసాడు. దీప్తికీ అతనికీ మధ్య దూరం తరుగుతోంది. శేఖర్ కళ్ళల్లో కసి, ఆ కసిని తీర్చుకోబోతున్నాననే ఆనందం కదలాడుతోంది. సరిగ్గా ఇంకా పది అడుగుల్లో అతను దీప్తిని చేరుకుంటాడనగా జరిగింది ఆ సంఘటన.

"రక్షించండీ, కాపాడండీ" బిగ్గరగా కేకలు వేస్తూ ఒక అమ్మాయి పరిగెత్తుకొస్తోంది. ఆమె వెనుక ఒక స్టూడెంట్ చేతిలో కత్తి పట్టుకుని ఆమెను వెంటాడుతున్నాడు. ఆ అమ్మాయి భయంగా పరిగెడుతోంది. అందరూ అవాక్కయిపోయి చేష్టలుడిగి చూస్తున్నారు. శేఖర్ పరిస్థితి కూడా అలాగే వుంది.

ఆ అమ్మాయి పరిగెత్తుకుంటూ శేఖర్ వున్న వైపే వస్తోంది. ప్రాణభయంతో పరిగెత్తుకుంటూ తన సమీపంగా వచ్చిన ఆ అమ్మాయిని పోల్చుకోగానే మొదట తీవ్రమయిన షాక్‌కి గురి అయ్యాడు అతను.

ఆ అమ్మాయి శేఖర్‌ను దాటేసి కాలేజీ మెయిన్ గేటు వైపు పరిగెడుతోంది. కత్తి పట్టుకున్న ఆ అబ్బాయి కూడా వదలకుండా ఆమెను వెంటాడుతున్నాడు. అప్పుడు తేరుకున్నాడు శేఖర్.

"లలిత.. తన చెల్లెలు. మైగాడ్.. ఎవడీ రాస్కెల్?" అనుకుంటూ, వాళ్ళ వెనకాలే పరిగెత్తి ఆ స్టూడెంట్ కాలర్‌ను వెనక నుండి దొరకబుచ్చుకున్నాడు. ఆ తరువాత ఊహించని వేగంతో అతన్ని పిడిగుద్దులు గుద్దసాగాడు శేఖర్.

పరిగెత్తుతూ వెనక్కి తిరిగి చూసిన లలిత అది చూసి వెనక్కి పరిగెత్తుకొచ్చి శేఖర్‌ని బలవంతంగా ఆపింది.

"అన్నయ్యా! ఎందుకు అతన్ని కొడుతున్నావు. అతన్ని వదిలిపెట్టు. నీకేం అధికారం వుందని అతన్ని కొడుతున్నావు" కోపంగా అంది లలిత.

"ఈ వెధవ నిన్ను చంపడానికొస్తుంటే నేను అడ్డుకోవడం తప్పా" విస్తుబోతూ అన్నాడు శేఖర్.

"అవును తప్పే. జరిగింది తెలుసుకోకుండా ఎందుకు అతని మీద చేయి చేసుకుంటావు" లలిత మాటతో అతన్ని వదిలేసాడు శేఖర్.

"ఇతను నన్ను ప్రేమించాడు. వెంటపడ్డాడు. ప్రాధేయపడ్డాడు. అయినా నేను వినలేదు. ఇతని ప్రేమని తిరస్క

పెరుమాండ్ల శ్రీదేవి


రించాను. అందుకే ఇతను నన్ను చంపడానికి వస్తున్నాడు. ఇందులో తప్పేముంది" నిలదీ సింది శేఖర్‌ని.

దాంతో విస్తుబోయాడు శేఖర్. "ఏంటి వాడి ప్రేమను కాదంటే వాడు నిన్ను చంపుతాడా. అది తప్పు కాదా. నన్ను నిలదీస్తున్నావా. నీకేమ యినా పిచ్చికానీ పట్టిందా?" చెల్లెలి మీద కోపంతో అరిచాడు శేఖర్.

"అతిగా ఆవేశపడకు అన్నయ్యా! దీప్తి విష యంలో నువ్వు చెయ్యబోయేది తప్పు అని నీకు అనిపించనప్పుడు, నా విషయంలో ఇతను చేసేది తప్పు అని ఎలా అనిపించింది నీకు?"

లలిత సూటిగా అడిగిన ప్రశ్న వెయ్యి ఓల్టుల కరెంట్ షాక్ కొట్టినట్టు అదిరిపడ్డాడు శేఖర్. అంతవరకూ అతనికి తను దీప్తిని చంపడానికి వచ్చానన్న స్పృహనే లేదు. అది గుర్తుకు వచ్చేసరికి అతని మొహం రక్తం లేనట్టుగా పాలిపోయింది.

"చెప్పన్నయ్యా! తాత్కాలికమైన నీ పగ కోసం క్షణికావేశంతో దీప్తిని చంపాలనుకున్నావు. నువ్వు ఆలోచించింది అంతవరకే. కానీ ఆ తరువాత పరిస్థితి గురించి ఒకసారి ఆలోచించు. నువ్వు చేసిన పనివల్ల అమ్మా నాన్నా, నేను, నలుగురిలో ఎన్ని అవమానాల పాలవుతామో ఆలోచించావా. పరువుకు ప్రాణమిచ్చే అమ్మా నాన్నా, నువ్వు చేసిన పనికి తలెత్తుకోలేక ఏమయినా అఘాయిత్యం చేసుకుంటే? మా సంగతి సరే. నీ గురించి అయినా ఆలోచించుకున్నావా. నువ్వు దీప్తిని చంపేస్తే నీ ఫ్రెండ్స్ నీకు పూలదండలు వేసి సన్మానించి హీరో బిరుదు ఇస్తారనుకుంటున్నావా? లేదు. నువ్వు దీప్తిని చంపిన మరుక్షణం నీ దగ్గరికి ఏ ఒక్కరూ రారు. ఒక హంతకుడిగా ముద్రపడి, భవిష్యత్తు అనేది లేకుండా జీవితాంతం ఒంటరిగా జైల్లో మగ్గిపోతావు.




ఇదంతా నాకెలా తెలుసా అని ఆశ్చర్యపోతున్నావా. నువ్వు విడుదలయి వచ్చిన దగ్గరి నుండి నిన్ను నిశితంగా గమనిస్తున్నాను నేను. నీ మానసిక స్థితిని అంచనా వేయడానికి నీ డైరీ చదివాను. నువ్వు దీప్తిని చంపాలనుకున్న విషయం చదివి నమ్మలేకపోయాను. నా అన్నయ్య ఒక ఆడపిల్ల ప్రాణం తీసేంత దుర్మార్గుడా అని కుమిలిపోతున్నాను. ఇప్పుడు చెప్పన్నయ్యా, నువ్వు చేసేది తప్పు అని నీకు అనిపించనప్పుడు ఇతను చేసేది నీకు తప్పెలా అనిపించింది."

తన చెల్లెలు వేస్తున్న ఒక్కొక్క ప్రశ్నకు సమాధానం చెప్పలేక దిమ్మెరపోయి నిలుచుకున్నాడు శేఖర్. వెనకా ముందు ఆలోచించకుండా తను చేయబోయిన దారుణాన్ని తలుచుకున్న శేఖర్, పశ్చాత్తాపంతో తల దించుకున్నాడు.

శేఖర్ నెమ్మదిగా అక్కడి నుండి కదిలి దీప్తి దగ్గరికి వచ్చాడు. అప్పటికే కాలేజీ స్టూడెంట్స్ అంతా అక్కడ చేరి వీళ్ళనే చూస్తున్నారు. శేఖర్ తన బెల్టు వెనక దాచుకున్న కత్తిని బయటికి తీసి దీప్తి పాదాల దగ్గర పెట్టి "నన్ను క్షమించు" అన్నాడు గద్గద స్వరంతో.

అది చూసి విద్యార్థులంతా కరతాళ ధ్వనులు చేశారు. మొదట అతని చర్యకు నిరుత్తరురాలైన దీప్తి కాసేపటికి తేరుకుని శేఖర్‌ని పైకి లేపి ఓదార్పుగా అతని భుజం తట్టింది.

"అన్నయ్యా! నువ్వు ఇంత తొందరగా నీ తప్పు తెలుసుకుంటావనుకోలేదు. అసలు నీలో ఈ మార్పు రావాలనే నేనూ, నా ఫ్రెండ్ వేణూ ఈ నాటకం ఆడాము. మా శ్రమ ఫలించింది" అంది లలిత నవ్వుతూ.

"అంటే.. నువ్వు పరుగెత్తడం, ఇతను కత్తి పట్టుకుని నీవెంట పడటం.. ఇదంతా.."

"ఇదంతా నాటకమే. కేవలం నువ్వు రియలైజ్ కావడం కోసం ఆడిన నాటకం. ఇతనికి నామీద ఎలాంటి ప్రేమా లేదు. కేవలం మామధ్య ఉన్నది స్నేహం మాత్రమే. నా రిక్వెస్ట్ మీద ఈ నాటకం ఆడాడు" చెప్పింది లలిత.

వేణు చేయి చాచి శేఖర్‌తో కరచాలనం చేసాడు.

"మీలో వచ్చిన ఈ మార్పు శాశ్వతంగా ఉండాలని కోరుకుంటున్నాను. మన కాలేజీ జీవితంలో ఎదురయ్యే విషాదాలు, ఆనందాలు ఒక స్వీట్ నథింగ్స్‌లా మన మనసుల్లో మిగిలిపోవాలి కానీ అవి మన జీవితాల్ని, భవిష్యత్తును నాశనం చేయడానికి కారణం కాకూడదు. ఒకరికి ప్రాణం పోసేది ప్రేమ అనిపించుకుంటుంది కానీ, నిలువునా ఒకరి ప్రాణాలు తీసేది ఎంతమాత్రం ప్రేమ అనిపించుకోదు. ఒప్పుకుంటారా?" అన్నాడు వేణు.

ఒప్పుకుంటున్నట్లుగా కళ్ళతోనే సమాధానం ఇచ్చి స్నేహపూర్వకంగా అతని చేయి నొక్కాడు శేఖర్.

❀

## కొత్త అందం

**ఎప్పుడూ ఒకేలా కన్పిస్తే ఎవ్వరికైనా బోర్‌గా ఉంటుంది. ఎవ్వరూ ఊహించని విధంగా కన్పించాలనుకుంటే ఇక తిరుగే ఉండదు. అందాల తార బిపాషాబసు ఇప్పుడలాగే స్టన్నింగ్ బ్యూటీగా కన్పిస్తోంది. 'కొన్ని కొన్ని సినిమాల్లో వైరైటీగా కన్పించాలని అనుకుంటాం. అందుకు తగ్గట్టుగా కాస్ట్యూమ్స్ ధరిస్తాం. అంతమాత్రాన వాటినే మనం కంటిన్యూ చేస్తే బోర్ కొడుతుంది' అంటోంది బిప్. ఈమె ఇప్పుడు తన వార్డ్‌రోబ్‌లో మంచి మంచి డిజైనింగ్ శారీలని ఎంపిక చేసుకుని దాచుకుంటోంది.**

